క్లుప్తంగా

రేపు మాదిగ జనజాతర

సామర్లకోట: ఉద్యమాల పురిటిగడ్డ ఈదుమూడులో ఆదివారం నిర్వహిస్తున్న మాదిగ జనజాతరను విజయవంతం చేయాలని మాదిగ సంఘ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని పిలుపు నిచ్చారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 1994 జూలై 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఈదుమూడులోనే ఏర్పడడంతో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని, మాదిగలు అందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ సత్యానందం

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రపంచ శాంతి కోసం నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. విరవ క్రీస్తు ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన షేక్ మక్బూల్, సామర్లకోటకు చెందిన వంకా జాన్, దైవ ప్రసంగాన్ని అందించారు. సంఘ విశ్వాసులు ఆలపించిన క్రైస్తవ గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాస్టర్లు, సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్, జయకుమార్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని గ్రామాలకు తాగునీరు అందించే ప్రధాన పైప్‌లైన్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో పలు గ్రామాలకు గత రెండు రోజేలుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ప్రధాన పైపులైన్ పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో మరమ్మతులకు గురైంది. దీని కారణంగా వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడ, గోర్స, కొమరగిరి, శివారు గ్రామాలైన పెద్ద కలవల దొడ్డి, చిన్న కలవల దొడ్డి, వెంకటరాయ పురం, నాగంపేట, ఆనంద్ నగర్, కామన్నగారి పాకల గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతు పనులు పూర్తి చేశారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు, చెవిటి మెషీన్లు అందజేస్తున్న దాతలు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ఉమా మనో వికాస కేంద్రంలో ఆయిల్ ఇండియా సహకారంతో దివ్యాంగులకు శుక్రవారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్పీ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయిల్ ఇండియా సంస్థ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ కాకినాడ నుంచి రూ.4.83 విరాళంతో పాటు 36 మందికి ట్రైసైకిళ్లు, చెవిటి మెషీన్లు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయిల్ ఇండియా సంస్థ ఈడీ అంజన్ జ్యోతి పుఖాన్ మాట్లాడుతూ సీఆర్‌ఎస్ నిధులుతో తమ వంతుగా కృత్రిమ అవయవాలు అందించామన్నారు. ఉమా మనో వికాస కేంద్రం ఈడీ పెద్దిరెడ్డి మాట్లాడుతూ గోదావరి లేడీస్ క్లబ్ సెక్రటరీ మైత్రేయ భట్టాచార్య చొరవతో ఆయిల్ ఇండియా కంపెనీ తమ సంస్థ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఇండియా సంస్థ డ్రిల్లింగ్ సీజీఎం సంజీవ్ గొగై, రాఖీ గొగై, ఉమామనో వికాస కేంద్రం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ జాతర

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసిన గ్రామదేవత మరిడమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. యనమల కృష్ణుడుకు ఆలయం వద్ద ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

అమ్మవారి ఊరేగింపు

జాతర సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ అమ్మవారిని అన్నవరం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. గరగల నృత్యం, విచిత్ర వేషధారణలు, జానపద నృత్యాలు, తీన్‌మార్ డప్పులు నడుమ ఊరేగింపు సాగింది.

వెతలకు చెల్లు.. వెదజల్లు..

- కూలీల కొరత, కూలి రేట్ల సమస్య లేకుండా సాగు
- ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీ



సామర్లకోటలో దమ్ములు చేసుకుంటున్న రైతులు



వీకే రాయపురంలో విత్తనాలు వెదజల్లుతున్న కూలీలు

సామర్లకోట: వారం రోజులుగా వర్షలు కురియడం, గోదావరి కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా రైతులు దమ్ములు చేసుకోవడం, వరి నాట్లు వేసుకోవడంలో బీజీ బీజీగా ఉన్నారు. పొలాలను మడుగులుగా చేసి నీటిని నింపి ట్రాక్టర్లతో దమ్ములు చేస్తున్నారు. తరువాత వెదజల్లు పద్ధతిలో వరి విత్తనాలు వేస్తున్నారు. కూలీల కొరత, కూలీ రేట్లు పెరిగి పోవడంతో రైతులు వెదజల్లు పద్ధతిలో సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరంలో వరినాట్లు వేసుకోవడానికి కనీసం 10 మంది కూలీలు కావలసి ఉంటుంది. దాంతో సుమారు రూ.ఆరు వేలు ఖర్చు అవుతుంది. వెదజల్లు పద్ధతిలో ఒక కూలీతో సరిపోతుంది. దాంతో ఆయా పొలాలకు చెందిన రైతులే స్వయంగా విత్తనాలను చల్లుకుంటున్నారు. 20 రోజుల క్రితం నుంచే రైతు భరోసా కేంద్రాలలో వరి విత్తనాలు సిద్ధంగా ఉండడంతో రైతులు విత్తన శుద్ధి చేసుకుని పంటలకు సిద్ధమయ్యారు. వెదజల్లు పద్ధతిలో సాగు చేసి యంత్రాలతో వరి కోతకు సిద్ధం కావడంతో ఎకరానికి సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలియజేస్తున్నారు. అలాగే వరి నాట్లు వేయడం, కూలీలతో వరి పంట కోత కోయడంతో ఎకరానికి రూ.35 వేలు అవుతుంది.

మండల పరిధిలో 22,250 వేల ఎకరాల్లో వరి సాగవుతోందని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. దీనిలో 80 శాతం వరకు వెదజల్లు పద్ధతిలోనే సాగవుతోంది. గొంచాల, అచ్చంపేట గ్రామాల్లో 25 శాతం వరకు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కాగా వెదజల్లు పద్ధతిలో సాగు చేయడం వలన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు వస్తే పంట పడి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాంత్రీకరణతో వ్యవసాయం



అధిక శాతం రైతులు ట్రాక్టర్లతో దమ్ములు, వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేస్తున్నారు. దాంతో రైతులకు కొంత మేర ఖర్చు తగ్గుతుంది. వర్షాలు కురవడంతో, గోదావరి కాలువకు నీరు రావడంతో రైతులు సాగులో బిజీ బిజీగా ఉన్నారు. పంట పండిన తరువాత వరి కోత మెషీన్లు అందుబాటులోనికి రావడంతో వాటితో కోత వల్ల వెంటనే ధాన్యం చేతికి వస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం యంత్రాలను సబ్సిడీపై అందజేసింది.

– ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

వెదజల్లుకే ప్రాధాన్యం



మండల పరిధిలో 80 శాతం వరకు రైతులు వెదజల్లు సాగుకే మక్కువ చూపుతున్నారు. ఈ పద్ధతి వల్ల సాగు ఖర్చు తగ్గుతుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు సిద్ధంగా ఉంచాం. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించి వారు పండించిన పంటకు మార్కెట్ చూపిస్తాం. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యం బస్తాకు అదనంగా రూ.400 వస్తుంది. గతంలో 24 వేల ఎకరాల్లో ఉండే సాగు రియల్ ఎస్టేట్, రొయ్యల చెరువులతో 22,250 ఎకరాలకు తగ్గిపోయింది.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాస అమావాస్యను పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్ పూజా కార్యక్రమాలు చేశారు.

గోతులకు మోక్షం

- జేపీ కన్‌స్ట్రక్షన్స్ సహకారంతో మరమ్మతులు
- ఆర్ అండ్ బీ జేఈ సూచనతో పనులు



సామర్లకోట-కాకినాడ రోడ్డులో గోతులు పూడుస్తున్న కాంట్రాక్టు సిబ్బంది

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ నుంచి రైల్వే గేటు వరకు రహదారిపై ఉన్న గోతులకు మోక్షం కలిగేలా జేపీ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు కృషి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గోతులు పడడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రోడ్ల గోతులు పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దాంతో ఆర్‌అండ్‌బీ జేఈ తోట మంగాదేవి అచ్చంపేట నుంచి రాక్ సిరామిక్స్ వరకు జరుగుతున్న 216 జాతీయ రహదారి కాంట్రాక్టరు (జేపీ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులను) ను గోతుల పూడ్చివేతకు సహకరించవలసిందిగా కోరారు. దాంతో పనులకు ఉపయోగించే సిమెంట్‌తో గోతులు పూడ్చే పనులు ప్రారంభించారు. దీనివల్ల సామర్లకోట–కాకినాడ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

విద్యార్థులలో ప్రశ్నించేతత్వం పెరగాలి



ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి చేతులు ఎత్తిన విద్యార్థులు



విద్యార్థితో పాఠ్యపుస్తకంలో పాఠాన్ని చదివిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులలో ప్రశ్నించే తత్వం పెరిగేలా చూడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉండూరు శివారు ప్రకాశరావుపేట ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలకు వచ్చిన ప్రతీ విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వసతులను పరిశీలించారు.

చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలి

విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ–2 పి.పుల్లయ్య అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కాపవరంలోని ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థుల పుస్తకాలు, హాజరు శాతం, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల బయట విక్రయించే చిరుతిళ్లకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. చిన్నతనం నుంచి చేతిరాత అందంగా ఉంటే 10వ తరగతిలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందని ఆయన హితవు పలికారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి



పార్టీ నేతలతో చర్చిస్తున్న వంగా గీత

పిఠాపురం: ఈ నెల 8వ తేదీన నిర్వహించే దివంగత మాజీ సీఎం వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగ గీత ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ నెల 8వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా వైఎస్సార్ విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ఉపాధి కల్పించండి

సామర్లకోట: స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలని జాతీయ స్థాయి కబడ్డీ స్వర్ణ పతక విజేత శ్వేత శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం 2012 స్పోర్ట్స్ కోటాలో 2 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేసిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి వివరిస్తూ తనకు ఆ కోటాలో ఉద్యోగం వచ్చేలా చూడాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ కబడ్డీ కోచ్ పోతుల సాయి, విశ్రాంత రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (స్పోర్ట్స్) ఎంఏ డీన్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎస్.కిరణ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌తో మరింత సుస్తీ

- కొత్త ఓపీ పద్ధతితో రోగులకు అవస్థలు
- సుస్తీతోనే గంటల తరబడి నిరీక్షణ
- రోగులను వేధిస్తున్న సిబ్బంది కొరత



పేర్ల నమోదు కోసం సామర్లకోట సీహెచ్‌సీ వద్ద బారులు తీరిన రోగులు

సామర్లకోట: తమకు వచ్చిన సుస్తీ కంటే ఆస్పత్రికి వెళ్లాక అక్కడ ఎదురవుతున్న పరిస్థితులు రోగులకు అదనపు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లిన దగ్గర నుంచి వైద్యుని వద్దకు వెళ్లే వరకు మధ్యలో ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేయించుకోడానికి నానా యాతన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్న నిబంధనతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగి తమ పేరు, ఆరోగ్య సమస్య వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వలన ప్రతి వ్యక్తికి సుమారు 10 నిమిషాలు పడుతోంది. దీనికి తోడు ఆన్‌లైన్ చేసే ఉద్యోగి కేవలం ఒకరు మాత్రమే ఉండడంతో సమస్యలు పెరిగిపోతున్నాయి. దాంతో రోగులు బారులు తీసి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆస్పత్రిలో సిబ్బంది కొరత వల్ల ఇటువంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆస్పత్రిలో సంపూర్ణంగా వైద్యులు ఉన్నా ఆస్పత్రికి వచ్చిన ప్రతీ రోగికి ఇబ్బంది తప్పడం లేదు. ఆయా కేసులకు సంబంధించిన వైద్యుల వద్దకు వెళ్లడానికి పూర్వపు మాదిరిగా చేతి రాతలో ఓపీ రాసి వైద్య పరీక్షలు పూర్తి అయిన తరువాత పుస్తకంలో నమోదు అయిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో సమస్యలు తప్పుతాయని రోగులు చెప్పున్నా వినే వారు లేరనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

డయేరియా నివారణకు ప్రత్యేక చర్యలు



వన్నెపూడిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానం వివరిస్తున్న వైద్య సిబ్బంది

- గ్రామాల్లో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం: డయేరియా నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో స్టాప్ డయేరియా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయాల వారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రతిఇంటికి 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డయేరియా సోకిన పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబెట్లు 14 రోజుల పాటు ఇచ్చి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశాలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం భేష్

- విద్యాశాఖ ప్రభుత్వ పథకాల ఏడీ నాగేశ్వరరావు
- గురజనాపల్లి హైస్కూలులో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు వడ్డించి, సహపంక్తి భోజనం



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఏడీ నాగేశ్వరరావు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ప్రభుత్వ పథకాల అసిస్టెంట్ డైరక్టర్ (ఏడీ) పడాల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, నిల్వ, అమలు తీరును ఆయన తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించి, పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతపై ఆయన సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్ పెంచాలని ఉపాధ్యాయులకు, భోజన పథకం నిర్వాహకులకు ఆయన సూచనలిచ్చారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ వంటకాలను రుచిగా వండాలని, విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. అనంతరం ఏడీ నాగేశ్వరరావు మధ్యాహ్న భోజనపథకంలో పాల్గొనే విద్యార్థులకు వడ్డించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ నాగలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై రాక్ సిరామిక్స్ కార్మికుల నిరసన



రాక్ సిరామిక్స్ గేటు ఎదుట ఒంటి కాలిపై నిరసన తెలిపిన కార్మికులు

సామర్లకోట: తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తూ రాక్ సిరామిక్స్‌లో తొలగింపునకు గురైన కార్మికులు శుక్రవారం ఫ్యాక్టరీ గేటు ఎదుట ఒంటి కాలిపై నిరసన తెలిపారు. వారి ఆందోళన 25వ రోజుకు చేరింది. రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 81 రోజులు గడిచిందని, ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ కార్మికులు సుబ్బారావు, మూర్తి, చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: జ్యేష్ఠ అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమంద్ర శర్మ ఘనపాఠి, కోట వంశీ, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 85 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యక్షంగానూ, మరో 15 మంది భక్తులు ఆన్‌లైన్‌లో రూ.1,116 చెల్లించి పరోక్షంగానూ హోమంలో పాల్గొన్నారు.